ముఖ్యమంత్రి కార్యాలయము

తెలంగాణ ప్రభుత్వం

పత్రికా ప్రకటన-1 4, డిసెంబరు, 2014

హైదరాబాద్ నగరంలో భూ ఆక్రమణలపై అత్యంత కఠినంగా వ్యవహరించాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ భూముల్లో నివాసం ఉంటున్న వారు పేద వారయితే వారికి వెంటనే భూమి పట్టాలు ఇవ్వాలని, దురాక్రమణ దారులయితే వారినుండి భూమిని స్వాధీనం చేసుకోవాలని చెప్పారు. కోట్లాది రూపాయల విలువైన ప్రభుత్వ భూములను కబ్జా చేసే వారిపై పిడి యాక్టు పెట్టడానికి కూడా వెనకాడవద్దని ఆదేశించారు. భూ కబ్జాలకు పాల్పడే వారు ఎంతటి వారైనా, ఏ పార్టీకి చెందిన వారయినా, టిఆర్ఎస్ పార్టి నాయకులైనా వొదిలిపెట్టవద్దని ముఖ్యమంత్రి అధికారులకు చెప్పారు. హైదరాబాద్‌లో ప్రభుత్వ భూములను రక్షించడం, భూ కబ్జాలపై తీసుకోవలసిన చర్యలు, మురికివాడల్లో నివసించే పేదలకు గౌరవ ప్రదమ్మైన నివాసాలు కట్టించడం, నిరుపేదలు ఉంటున్న స్థలాలకు పట్టాలివ్వడం లాంటి అంశాలపై సచివాలయంలో ముఖ్యమంత్రి ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఆర్థిక శాఖ మంత్రి ఈటెల రాజేందర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రాజీవ్ శర్మ, సిఎంఒ ముఖ్య కార్యదర్శి నర్సింగరావు, రెవిన్యూ శాఖ కార్యదర్శి మీనా, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల కలెక్టర్లు మీనా, శ్రీధర్, హైదరాబాద్ నగర పరిధిలోని జాయింట్ కలెక్టర్లు, ఆర్‌డిఓలు ఈ సమీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి అధికారులను ఉద్దేశించి ఈ విధంగా మాట్లాడారు.

‘‘నగరంలో అర్బన్ ల్యాండ్ సీలింగ్ ద్వారా సమకూరిన మిగులు భూములు, ప్రభుత్వ భూములు ఉన్నాయి. అవి రకరకాలుగా ఆక్రమణలకు గురవుతున్నాయన్నారు. గ్రామాల్లో పని దొరకక పట్టణాలకు వలస వచ్చినవారు తలదాచుకోవడం కోసం గుడిసెలు, రేకుల షెడ్డులు వేసుకొని జీవించే వారు ఒక రకం. ప్రభుత్వ భూములను కబ్జా చేసి వ్యాపార కూడళ్లు, అపార్టుమెంట్లు నిర్మించే వారు మరో రకం. వీటిలొ మొదటి రకమయిన పేద వారి పట్ల ప్రభుత్వం అత్యంత ఉదారంగా వ్యవహరిస్తుంది. వారికి భూమి పట్టాలు ఇవ్వాలి. మంచి ఇండ్లు నిర్మించాలి. వారు కూడా

గౌరవప్రదంగా బతికేలా ప్రభుత్వం చేయూతనివ్వాలి. అలాంటి పేదలు నాలాలకు అడ్డంగా నివాసాలు ఏర్పరుచుకుంటే వారికి మరోచోట నివాసం కల్పించాలి. నాలాలను క్లియర్ చేయాలి. ఇక రెండవ రకమయిన భూ కబ్జాదారులపట్ల అత్యంత కఠినంగా ఉండాలి. హైదరాబాద్‌లో ప్రభుత్వ భూములను ఆక్రమించుకొనే ముఠాలు ఉన్నాయని, నకిలీ స్టాంపులు, నకిలీ స్టాంపు పేపర్లు, నకిలీ సర్టిఫికెట్లు కూడా పుట్టిస్తున్నారు. ప్రభుత్వ భూములపై కూడా హక్కులు పొందుతున్నారు. అలాంటి వేల సంఖ్యలో కోర్టు కేసులు ఉన్నాయి. ఈ అక్రమాలకు తెరపడాలి. గత ప్రభుత్వాలు అలాంటి వారిపట్ల చూసి చూడనట్లు వ్యవహరించాయి. కుల తత్వం, ప్రాంతీయతత్వం, రాజకీయ ప్రేమ ప్రదర్శించాయి. కాని మా ప్రభుత్వం ఆక్రమార్కులను ఉపేక్షించదు, అక్రమాలను సహించదు. భూ ఆక్రమణలకు పాల్పడే వారు ఎవరనేది మాకు అనవసరం. ప్రభుత్వ భూమిని ఆక్రమించినవారు శిక్షకు అర్హులు. వారి కోసం పైరవీలు చేసే ఖర్మ ప్రభుత్వానికి పట్టలేదు. ఎవరైనా సరే తప్పు చేస్తే శిక్ష పడాల్సిందే. ఏ పార్టీ వారైనా మాకు ఒకటే. భూ కబ్జాలకు పాల్పడినవారు టిఆర్ఎస్ కార్యకర్తలైనా వొదిలిపెట్ట వద్దు. వారి పైనే ముందు కేసులు నమోదు చేసి ప్రభుత్వ ఉద్దేశ్యాన్ని స్పష్టంగా చాటి చెప్పాలి. ప్రభుత్వ భూముల్లో ఇప్పటికే నిర్మాణాలు జరిపితే ఆక్రమించుకున్నవారు అవసరమైతే వాటిని రెగ్యులరైజ్ చేయించుకోవాలి. రెగ్యులరైజ్ చేయించుకోకుంటే వారినుండి భూమిని తిరిగి స్వాధీనం చేసుకోవాలి. ప్రజోపయోగ కార్యక్రమాల పేరు చెప్పి ప్రభుత్వం నుండి భూమి పొందిన వారు సదరు భూమిని వ్యాపార అవసరాల కోసం వాడుకుంటున్నారు. అలాంటి వారి విషయంలో కూడా కఠినంగా వ్యవహరించాలి. అసైన్డ్ ల్యాండ్స్ కూడా ఆక్రమణకు గురువుతున్నాయి. వాటి సంగతి కూడా తేల్చాలి. ప్రభుత్వ అవసరాల కోసం ఏదైనా నిర్మాణం చేద్దామంటే జాగ దొరకడం లేదు. కాని ఆక్రమణదారులకు మాత్రం వేలాది ఎకరాలు కబ్జా చేయడం సులభమయిపోతున్నది. పేదలు గుడిసెలు వేసుకుంటే దౌర్జన్యంగా ప్రభుత్వమే తొలగిస్తున్నది. అదే పెద్దలు భూమిని ఆక్రమించి బహుళ అంతస్తులు కడితే అడిగే వారుండరు. తెలంగాణ రాష్ట్రంలో కూడా ఇదే అన్యాయం కొనసాగితే ఇక రాష్ట్రం వచ్చిన ప్రయోజనం ఏమి ఉండదు. కాబట్టి అధికారులు చాలా అప్రమత్తంగా ఉండాలి. పేదల పక్షపాతిగా వ్యవహరించాలి. అక్రమార్కుల విషయంలో మూడోకన్ను తెరవాలి.

ప్రభుత్వ భూములను ఆక్రమించినవారి విషయంలో నేను కఠినంగా ఉంటే కొంతమందికి గిట్టదు. నన్ను బద్నాం చేయాలని కూడా చూస్తారు. అయినా నేను దేనికి భయపడను. ఖచ్చితంగానే ఉంటా. వెనక్కి తగ్గను. నన్నెవరూ వొత్తిడికి గురి చేయలేరు. నాకు స్వప్రయోజనాలు లేవు. ప్రభుత్వ భూములు కాపాడబడాలి. అవి ప్రజోపయోగ పనులకు ఉపయోగపడాలి. పేద ప్రజలకు మేలు జరగాలి. అదే నా లక్ష్యం. ప్రభుత్వ ఉద్దేశ్యాన్ని, చిత్తశుద్ధిని అర్థం చేసుకోండి. హైదరాబాద్ నగరానికి పట్టిన జబ్బు, గబ్బు వొదిలించే బాధ్యత మీపైన పెడుతున్నాను. ప్రభుత్వ భూమిని ఎవరైనా ముట్టుకోవాలంటేనే భయపడాలి''.

## భూముల వ్యవహారం కార్యదర్శుల కమిటీకి

హైదరాబాద్‌లో ప్రభుత్వ భూముల పరిరక్షణ, ఆక్రమణదారులపై వ్యవహరించాల్సిన పద్ధతి, లీజ్డ్ ల్యాండ్స్ విషయంలో అనుసరించాల్సిన విధానం, అసైన్డ్ ల్యాండ్స్ వ్యవహారం తదితర అంశాలపై విధి విధానాలు రూపొందించే బాధ్యతను ముఖ్యమంత్రి కేసిఆర్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నేతృ త్వంలోని కార్యదర్శుల కమిటీకి అప్పగించారు. ఈ కమిటీ హైదరాబాద్ పరిధిలోని కలెక్టర్లు, రెవిన్యూ అధికారులతో ఈనెల 9న పూర్తి స్థాయి సమావేశం నిర్వహించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. నగరంలో ప్రభుత్వ భూములు ఎన్ని? అందులో ఆక్రమణకు గురైనవి ఎన్ని? ఖాలీగా ఉన్నవి ఎన్ని? నిర్మాణాలు జరిగినవి ఎన్ని? ఒక అవసరం కోసం తీసుకొని వాటిని మరొక అవసరం కోసం వాడుకోవడం కోసం నిబంధనలు ఉల్లంఘించిన వారెందరు? తదితర వివరాలపై సమీక్ష నిర్వహించాలని చెప్పారు. అలాంటి వారి విషయంలో కఠినంగా వ్యవహరించడానికి ఇప్పుడున్న చట్టాలు సరిపోవనే అభిప్రాయం కూడా ముఖ్యమంత్రి వ్యక్తం చేశారు. దీనికోసం వెంటనే కఠినమైన చట్టం తేవాలని ఆదేశించారు. కార్యదర్శుల కమిటీ కొత్త చట్టానికి రూపకల్పన చేయాలని చెప్పారు. ఈ చట్టానికి సంబంధించి త్వరలోనే ఆర్డినెన్స్ తెస్తామని ప్రకటించారు. భూ కబ్జాలకు పాల్పడడం, దొంగ కాగితాలు పుట్టించడం, అధికారులు ఏండ్ల తరబడి కోర్టు కేసుల చుట్టూ తిరగడం పరిపాటి అయ్యిందని ముఖ్యమంత్రి అసహనం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో ఈలాంటి దందా ఉండవద్దని హెచ్చరించారు. హైదరాబాద్ నగరంలోని ప్రతి ఇంచు భూమికి పత్రం ఉండాల్సిందేనని

స్పష్టం చేశారు. భూమి రెగ్యులరైజ్ చేసే అవకాశం ఉన్నచోట్ల దరఖాస్తులు స్వీకరించి, విచారణ జరిపి రెగ్యులరైజ్ చేయాలని కూడా ముఖ్యమంత్రి చెప్పారు. కోర్టు వివాదాలను కూడా త్వరగా తేల్చాలని చెప్పారు. ప్రభుత్వ భూములను సులభంగా రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్నారని, ప్రభుత్వం పేదలకు ఇచ్చిన భూములు కూడా ఇతరులు సులభంగా దక్కించుకుంటున్నారని ముఖ్యమంత్రి చెప్పారు. అలా జరుగకుండా రిజిస్ట్రేషన్ అధికారులకు కూడా స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని, దీనికి సంబంధించి కూడా విధి విధానాలు రూపొందించాలని ముఖ్యమంత్రి చెప్పారు. బిల్డింగ్ రెగ్యులరైజేషన్ స్కీం, లే అవుట్ రెగ్యులరైజేషన్ విధానాలకు సంబంధించి కూడా మార్గదర్శకాలు రూపొందించాలని చెప్పారు.

## నిరుపేదలకు ఆవాస కేంద్రాలు

పొట్ట చేతబట్టుకుని హైదరాబాద్‌కు వలస వచ్చినవారికి నిలువ నీడ కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని ముఖ్యమంత్రి చెప్పారు. హైదరాబాద్ నగరం పరిధిలో దాదాపు రెండు లక్షలకు పైగా పేద కుటుంబాలు గుడిసెలు, రేకుల షెడ్డులు వేసుకొని, ఇరుకు ఇండ్లలో ఉంటున్నారని చెప్పారు. వారికి మెరుగైన ఆవాసాలు కల్పించాలన్నారు. ఆ మాత్రం కూడా నీడ లేని వారు మరో లక్షన్నర వరకు ఉంటారని వారంతా రైల్వే ప్లాట్‌ఫారాలపై, ఫుట్ పాత్‌లపై పడుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటి వారికి రాత్రి వేళ ఆశ్రయం కల్పించడానికి నగరంలో 50 నైట్ షెల్టర్లు నిర్మించాలన్నారు.

--------------------------------------------------------

సిపిఆర్ఓ టు సిఎం